**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాప్ రిపోర్టర్‌లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్‌లు కావలెను.

**సంప్రదించ వలసిన నెంబర్:**

**7095999737,9908103501**



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:02 ఎడిటర్: రాపోలు లింగస్వామి 27 -08 -2026 గురువారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## అన్ని విధాలుగా అండగా ఉంటాము

### : నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్



ఆకస్మిక వరదలతో నేపాల్ అతలాకుతలమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సంఘీభావం తెలిపారు. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా ఫోన్‌లో సంఘీభావం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో అన్ని రకరాల సహాయసహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎక్స్ వేదికగా ఈ విషయాలను ప్రధాని వెల్లడించారు. భారత్ నేపాల్‌కు అన్నిరకాలుగా అండగా ఉంటుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. ఇప్పటికే భారత సహాయక బృందాలు నేపాల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపారు. మరోవైపు, నేపాల్‌కు మానవతాసాయం పంపించేందుకు కూడా సిద్ధమవుతున్నామని ఎయిర్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఔషధాలు, రేషన్ సామాన్లను నేపాల్‌కు పంపించనున్నట్టు చెప్పారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన బృందాలను కూడా నేపాల్‌కు పంపించే యోచనలో ఉన్నామని సంబంధిత వర్గాలు తెలిపాయి. రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో అకస్మాత్తుగా పోటెత్తిన వరదలతో 22 మంది మరణించిన విషయం తెలిసిందే. మరో 400 మంది గల్లంతయ్యారు. 105 మంది భారతీయులు కూడా ఈ వరదల్లో గల్లంతైనట్టు తెలుస్తోంది. మరోవైపు, అక్కడి భారతీయుల సహాయార్థం నేపాల్‌లోని ఇండియన్ ఎంబసీ ఎమర్జెన్సీ నెంబర్లను ప్రకటించింది. +977 985 131 6807, +977 970 910 7500 నెంబర్లపై తమను సంప్రదించవచ్చని చెప్పింది.

## ధరణితోనే అనేక భూ సమస్యలు..

### గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్



హైదరాబాద్, ఆగస్టు 26: గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహిం చిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవ డానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యలపరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

ఆ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు

ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం..

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

## దోరకుంట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

:మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తీవ్రగ్భ్రాంతి

:మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

:క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

కోదాడ, ఆగస్టు 26 మండల పరధిలోని దోరకుంట సమీపంలోని హైదరాబాద్?విజయవాడ జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్ పద్మావతి రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం సంభవించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికుల జీవితాలు మార్గమధ్యంలోనే విషాదాంతం కావడం హృదయవిదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఈ అపార విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ సకాలంలో అత్యుత్తమ వైద్య సేవలు అందేలా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చికిత్స విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆకాంక్షించారు.

## కోదాడలో రోడ్డు ప్రమాదం...

## సిఎం రేవంత్‌గ్భ్రాంతి



కోదాడ: సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ మండలం ద్వారకుం ట దగ్గర కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ ఢీకొట్టడంతో ఆరుగురు మృతి చెందారు. మృతుల కుటుంబాలకు సిఎం రేవంత్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దొరకుంట గ్రామ సమీపంలో ఆగి ఉన్న కంటైనర్ ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఆరుగురు దుర్మరణంచెందడంతోపాటు20 మంది ప్రయాణికులు గాయపడ్డారు.






## గోరంట్ల-హిందూపురం జాతీయ రహదారి పనులను వేగవంతం చేసిన మంత్రి సవిత

### పూర్తయిన రహదారి పనులను ప్రారంభించిన మంత్రి సవిత



జ్యోతి ప్రభంజనం ప్రతినిధి అనంతపురం:పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం నుంచి హిందూపురం వరకు సుమారు 30 కిలోమీటర్ల మేర రూ.500 కోట్ల వ్యయంతో చేపడుతున్న జాతీయ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో గోరంట్ల పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న విషయాన్ని స్థానికులు మంత్రి సవిత దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై వెంటనే స్పందించిన మంత్రి సవిత జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు.ఈ క్రమంలో పూర్తయిన రహదారి పనులను మంత్రి సవిత అధికారులతో, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. జాతీయ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గోరంట్ల, హిందూపురం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని మంత్రి సవిత తెలిపారు.ప్రజల భద్రత, సౌకర్యమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు గోరంట్ల మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరు పెట్టాలి



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 26:బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ఫ్లోర్ లీడర్ స్వర్గీయ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరును సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు పెట్టాలని మలక్‌పేట్ వాసులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు మలక్‌పేట్‌లోని పలు కాలనీల ప్రతినిధులు సమావేశమై తీర్మానం చేశారు. ప్రజల కోసం సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు.అన్నా అని పిలిస్తే 'నేనున్నా' అంటూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన మహానుభావుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి. ప్రజల కోసం ఆయన చేసిన సేవలకు గుర్తుగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు ఆయన పేరు పెట్టాలి" అని వారు కోరారు.ఆయన సేవలను భావితరాలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం తక్షణమే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్‌కు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆయన అభిమానులు పాల్గొని డిమాండ్‌కు తమ మద్దతు తెలిపారు.

# సంపాదకీయం

## ఉద్యోగుల డిమాండ్లకు మోక్షమెప్పుడు?

తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది. ఉద్యోగ సంఘాలుగా ఏర్పడి చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది. వారు తమ జీతం గురించి కాకుండా తమ పిల్లలు, తమ ప్రాంత భవిష్యత్తు గురించి, తెలంగాణ ఆత్మగౌరవం గురించి ఉద్యమించారు. సకలజనులతో సమ్మెలో పాల్గొని పాలనను స్తంభింపజేశారు. పెన్‌డౌన్ చేసి పెను సంచలనం సృష్టించారు. సహాయ నిరాకరణతో సమరశంఖం పూరించారు. తమ ఉద్యోగాలను, కుటుంబాలను పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారు. అందుకే, వారు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు తెలంగాణ ఉద్యమకారులు కూడా. కాబట్టి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఉద్యమాన్ని నడిపిన నాయకుడు కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడంతో ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా 2015లో 10వ పీఆర్సీ సిఫారసు చేసిన 29%కు బదులుగా 43% ఫిట్‌మెంట్ ప్రకటించారు. తద్వారా తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యధిక వేతనం తీసుకునే ఉద్యోగులయ్యారు. అలాగే, 2021లో 1వ పే రివిజన్ కమిటీ 7.5% ఫిట్‌మెంట్ సిఫారసు చేస్తే కేసీఆర్ ప్రభుత్వం అదనంగా 22.5 పాయింట్లు జోడించి 30% పీఆర్సీ ఫిట్‌మెంట్ ప్రకటించింది. కేసీఆర్ ఫిట్‌మెంట్ తర్వాత, కాంగ్రెస్ హామీలను నమ్మి ఓట్లు వేస్తే చివరకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కావడం లేదు. సగం మందికి ఒకటో తేదీన జీతాలు రావడంలేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలలకు ఒకసారి కూడా జీతాలు అందడంలేదు. మరోవైపు, పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆర్థిక భారాలకు అనుగుణంగా ఉద్యోగుల కొత్త పీఆర్సీ అమలు చేయాలి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేండ్లు కావొస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికే ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ, ప్రభుత్వం కరువు భత్యాన్ని కూడా కానుకల లెక్క దశలవారీగా ఇస్తుండటం దారుణం. మా పెండింగ్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ఉద్యోగులు అడిగితే తనను కోసుకొని తిన్నా రూపాయి రాదని, ప్రభుత్వం దివాలా తీసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారు. తాను ఎక్కడికైనా వెళ్తే చెప్పులు ఎత్తుకపోయేవాడిలా చూస్తున్నారని మాట్లాడటం అత్యంత ఆందోళన కలిగించే అంశం. అలాగే, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను తొలగించి 2004 తర్వాతి ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించడం ప్రధాన డిమాండ్. ఎందుకంటే, ఉద్యోగులు తమ ఒంట్లో సత్తువ ఉన్నన్ని రోజులు ప్రభుత్వానికి సేవలు చేస్తే ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఆర్థిక భద్రత లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. నెలవారీగా పెన్షన్ రావడం రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించినట్టు ఉన్నది. ఆ సమయంలో ఇచ్చే పెన్షన్ కేవలం డబ్బు కాదు, అదొక ఆత్మగౌరవం. మలిదశలో ఎవరి మీదా ఆధారపడకుండా జీవించే స్వేచ్ఛ. 30, 35 ఏండ్ల ప్రభుత్వ సేవకు లభించే భరోసా. ప్రభుత్వంలో, పాలనలో భాగస్వామి అయిన ఉద్యోగికి అనారోగ్యం వస్తే హాస్పిటల్ బిల్లు ఎలా కట్టాలో అర్థంకాకనే సగం కుమిలిపోతున్నారు. అనేక సందర్భాల్లో దవాఖానలు కార్డులు స్వీకరించకపోవడం, నగదురహిత వైద్యం అందకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం అత్యంత దయనీయం. అయితే ఈహెచ్‌ఎస్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని అంటూ ఉద్యోగుల కనీస వేతనం నుంచి 1.5% మొత్తాన్ని రెండు నెలలపాటు కట్ చేశారు. కానీ ఆ పథకం ప్రారంభం కాలేదు. అందులోనూ ప్రముఖ కార్పొరేట్ దవాఖానలకు కాకుండా కేవలం ప్రభుత్వ దవాఖానలను మాత్రమే ఈ పథకంలో చేర్చారని ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతున్నది. జీవో 317 కారణంగా స్థానికత, ఉద్యోగాల కేటాయింపు వంటి అంశాల్లో అనేక మంది ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న విషయం వాస్తవం. ఉద్యోగిని ఓ జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ చేయడం పరిపాలనా నిర్ణయం కావచ్చు. కానీ, ఇదొక కుటుంబాన్ని రెండు భాగాలుగా విడదీసిన విషాద నిర్ణయం అయింది. భార్య ఒకచోట, భర్త మరోచోట, తల్లిదండ్రులు ఒకచోట, పిల్లలు మరోచోట కావడంతో వారంతా గూడు చెదిరిన పక్షులయ్యారు. ఉద్యమం చేసిన ఉద్యోగులను కేసీఆర్ పీఆర్సీ విషయంలో అడిగినదానికంటే ఎక్కువ అమలు చేసి, తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగులకు అగ్ర తాంబూలం ఇచ్చారు. కానీ, రాజకీయ లబ్ధి పొందిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీవో 317 రద్దు చేస్తామని హామీ ఇచ్చి మూడేండ్లు కావొస్తున్నా అమలు చేయడం లేదు. మరోవైపు, ఏండ్ల తరబడి ఒకే పోస్టులో ఉద్యోగం చేస్తున్న వారు సైతం ఉద్యోగోన్నతుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఎందుకంటే, ప్రమోషన్ తమ పనితనానికి, ప్రతిభకు దక్కిన గౌరవంగా ఉద్యోగులు చూస్తారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగోన్నతి రాకపోవడం వల్ల వారిలో నిరుత్సాహం మొదలవుతుంది. వారు చేసే పనిలో సమర్థత సన్నగిల్లుతుంది. కాబట్టి, శాఖల వారీగా ఖాళీలను గుర్తించి నిర్ణీత సమయంలో ఉద్యోగోన్నతులు కల్పించాలి. ఎన్నికల ముందు ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

# రాజకీయాల్లో 'రవి' కాంతులు..

**అంజన్న రాజకీయ వారసుడిగా "రవీందర్ యాదవ్"..**

**బీఆర్ఎస్ నేతలను వెంట తిప్పుకుంటూ చురుకుగా కార్యక్రమాలు..**

**యువనేత వై. రవీందర్ యాదవ్ కొత్త రాజకీయ సమీకరణ..**

**ఊహించని రాజకీయ ట్విస్టులకు శ్రీకారాలు**

రాజకీయం.. ఇది ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు.. నాయకుడిగా ఎవరు ఎదుగుతారో.. ఎవరు ఎటువైపు కదులుతారో అర్థం కాదు.. కానీ షాద్ నగర్ బీఆర్ఎస్ లో మాత్రం ఒకటి స్పష్టంగా కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ పెద్ద కుమారుడు రవీందర్ యాదవ్ రాజకీయంగా "యాక్టివ్" గా మారిపోయారు.. బీఆర్ఎస్ వర్గాలను ఉత్సాహపరుస్తూ చురుకుగా ముందుకు సాగుతున్నారు. ఎల్లప్పుడూ వివాదాలకు దూరంగా ఉంటూ ఆచితూచి నిరంతరం అడుగులు వేస్తూ గత పాలన అనుభవంతో ముందుకు సాగుతూ రాజకీయంగా ఒక నూతన ఒరవడిని సృష్టించ బోతున్నారు. ఈ మధ్యకాలంలో నియోజకవర్గంలో రవీందర్ యాదవ్ అలియాస్ రవన్న రాజకీయ పర్యటనలు విమర్శకులను సైతం ఆలోచింపజేస్తున్నాయి. ఇటీవల కాలంలో మరోవైపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా బిఆర్ఎస్ పార్టీలో అంజయ్య యాదవ్ నే ప్రధాన ప్రత్యర్థిగా భావించడం జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో యాదవ సామాజిక వర్గం పార్టీలకు అతీతంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగృహానికి వెళ్లి సామాజిక సమావేశానికి హాజరు కావడం కూడా రాజకీయంగా వారికి ఉన్న పట్టు గురించి తెలియజేస్తుంది. అలాగేస్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సైతం తన కోడలు రాణి వివాహానికి ఇంటికి వెళ్లి మరి పత్రిక ఇచ్చి స్వయంగా ఆహ్వానించడం ప్రస్తుతం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందనీ చెప్పవచ్చు. ఈ పత్రిక ఇచ్చిన వైనం మాజీ ఎమ్మెల్యే అంజయ్య ఇంటి గడప తొక్కిన వీర్లపల్లి శంకర్ రాజకీయ ధైర్యంతో ఎవరి రాజకీయ పలుకుబడి ఏమిటో చెప్పకనే చెబుతుందని రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారుతుంది. ఎమ్మెల్యే నేటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎంతో పెద్దమనసుతో మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడం మంచి మార్పుకు కారణమని కొందరు అంటుండగా కాంగ్రెస్ పార్టీలో మాత్రం ప్రత్యర్థి ఇంటి గడప తొక్కడం కొంత ఇబ్బందికర పరిస్థితి గానే చెప్పవచ్చు. అదే బిఆర్ఎస్ పార్టీలో మాత్రం ఫుల్ జోష్ నెలకొంది. ముఖ్యంగా యువనేత రవీందర్ యాదవ్ అంజన్న రాజకీయ వారసుడిగా లైన్ క్లియర్ అవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒక్కసారి మారుతున్న తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే..

**నిన్నటి కథ..**

రాజకీయాల్లో తూక్యా.. మైక్యా... అంటూ నిన్నటిదాకా తిట్టుకున్న కాంగ్రెస్ – బీఆర్ఎస్ రాజకీయాలు మనకు తెలిసిందే. ప్రస్తుతం ఈ వాతావరణంలో చాలా వరకు మార్పు కనిపిస్తుంది. ఏడు పదులు దాటిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఇక రాజకీయంగా పక్కకు జరిగి కుమారుడిని తెరమీదికి తెచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు రవీందర్ యాదవ్ కూడా పదేళ్లపాటు తండ్రికి అన్ని విధాల అండగా ఉండి పాలనలో తన భాగస్వామ్యాన్ని అందించడంతో పాటు రెండవసారి తన తండ్రి గెలుపుకు కారణమయ్యారు. ఓటమి తర్వాత కూడా నిరంతరం యాక్టివ్ గా ఉంటూ కార్యకర్తలను వదులుకోకుండా గ్రామాలు తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో పటిష్టంగా ఉండేలా కృషి చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గం ప్రత్యేకంగా ఏర్పడడం పార్టీకి కొంత శరాఘాతంగా మారినప్పటికీ ఆ లోటును పూడ్చి పార్టీకి జవసత్వాలు అందించే దిశగా రవి అడుగులు వేస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా రవీందర్ యాదవ్ నే తన ప్రత్యర్థిగా భావిస్తున్నారని స్పష్టమవుతుంది. ఎన్నడూ




అంజయ్య యాదవ్ ఇంటి గడప కూడా తొక్కని వీర్లపల్లి శంకర్ స్వయంగా వెళ్లి అతడిని వివాహానికి ఆహ్వానించడం ప్రత్యర్థులకు మింగుడు పడనిదిగా మారింది. ఇంత శత్రుత్వం ఉన్న అది రాజకీయాలకే పరిమితం అని, మంచి, చెడు సమయాలలో ఒకరికి ఒకరు కలిసి ఉండాలని సంకేతాన్ని ఈ ఇరువురు నాయకులు ఇవ్వడం రాజకీయ పెను మార్పులకు ఊతాన్ని ఇస్తున్న అంశం. ప్రస్తుతం రాజకీయాలకు ఇలాంటి మార్పులే కావాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. **ఇదేంటి.. ఇలా జరిగింది..** నిన్న మొన్నటి దాకా రాజకీయ శత్రువులుగా ఉన్న కాంగ్రెస్–బీఆర్ఎస్ వర్గాలలో మాత్రమే కాదు.. ప్రత్యర్థులలో కూడా రాజకీయంగా ఇద్దరు ఇద్దరే అనిపించుకున్న ఎమ్మెల్యే శంకర్, రవీందర్ యాదవుల కలయిక ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒకవైపు ఇప్పటికే బీఆర్ఎస్ లో నవీన్ రెడ్డి వర్గం రూపంలో రాజకీయ కుంపటి ఉంది. ఇలాంటి దశలో ఎమ్మెల్యే రవీందర్ యాదవ్ కి ప్రాధాన్యతనివ్వడం చర్చకు దారి తీస్తుంది. మరోవైపు బిజెపి నాయకులకు కూడా ఇది మింగుడు పడడం లేదు. దశాబ్దాలుగా షాద్ నగర్ నియోజకవర్గంలో తమ సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నా .. బిజెపి నాయకులు మారినా రాజకీయ సీన్లతో ఎలా ముందుకు వెళ్లాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రవీందర్ యాదవ్ కూడా రాజకీయంగా ఎన్నికల సమయంలో పోరాడాలి.. ఇప్పుడు విమర్శలు అవసరం లేదు.. పార్టీని పటిష్టం చేయడం ముఖ్యం అనే ధోరణిలో గ్రామ గ్రామానికి వెళుతూ బీఆర్ఎస్ నేతల్లో మంచి ఉత్సాహాన్ని నింపుతూ వివాదాల జోలికి పోకుండా ముందుకు సాగుతుండడం ద్వారా ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేది రవీందర్ యాదవ్ అన్న చర్చ ప్రతి చోటా సాగుతోంది. కొంతమంది కార్యకర్తలు అభిమానులు అన్నను ఎమ్మెల్యేగా చూడాలి అంటూ సోషల్ మీడియాలో ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. దీన్నిబట్టి భారత రాష్ట్ర సమితిలో రవి యువసత్తా కనిపించే విధంగా తాజా పరిణామాలు దీనిని బలపరుస్తున్నాయి. దీనితో నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.

# వెంకటియతండా ప్రాథమిక పాఠశాలకు చేయూత

**బోడ రమేష్ రూ 20, వేలు అందజేత**



గార్ల మండల పరిధి వెంకటియ తండా ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడలకు రంగులు వేయడానికి బోడ రమేష్ రూ 20, వేలు వితరణ గావించారు, ఆ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ భూక్య వీరన్న పలు పర్యాయాలు ప్రాథమిక పాఠశాల వెంకటయ్య తండా భౌతిక వసతుల మెరుగుదల కోసం సహాయాన్ని అందించవలసిందిగా బోడ రమేష్ ను కోరారు. అక్షరాభ్యాసానికి పునాది గొలిపే ప్రాథమిక పాఠశాల ప్రహరీ మొత్తానికి కలర్, వాల్ పెయింటింగ్ రాయించడానికి బోడ రమేష్ స్పందించి రూ 20 వేలను వితరణ గావించారు. ఆ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి కోటయ్య ఇతరుల గావించిన డబ్బులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు బి కోటయ్య మాట్లాడుతూ ఆ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి, ఆ పాఠశాలలో అభ్యసించిన పూర్వ విద్యార్థులు, దయార్థ హృదయులైన దాతలు ముందుకు వచ్చి పాఠశాల ప్రగతికి దోహదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లి, దిక్కు హరి నందు మహేష్ కుమార్ గ్రామ యువకులు సమన్వయంగా పాల్గొని వితరణ గావించిన బోడ రమేష్ ను సన్మానించి అభినందనలు తెలిపారు.

**సెప్టెంబర్ 19,20 తేదీలలో...**

# ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు

హైదరాబాద్, ఆగస్టు 24:ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్ తెలిపారు. అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్ధరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, అదేవిధంగా అక్టోబర్ 28న ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగే నిరసన ప్రదర్శన కు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలిస్తామని అన్నారు.

# భాధ్యత గా పని చేస్తే గుర్తింపు లభిస్తుంది



మోతె కార్యకర్తలు బాధ్యత గా పని చేస్తే పార్టీ లొ గుర్తింపు లభిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని గోల్ తండా సర్వారం గ్రామాలలో జరిగిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ లు ఎన్నిక సందర్బంగా పాల్గొన్న అయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ ఇచ్చిన భాధ్యతలను తూచ తప్పకుండ అమలు చేయాలని ఎన్నికలు ఏమైన పార్టీ సూచించిన వారిని గెలిపించాలని కోరారు ఏకగ్రీవంగా గోల్ తండా గ్రామ అధ్యనాయక్షులు గా ధరవత్ కుర్వ నాయక్ సర్వారం అధ్యక్షులు గా వీరబోయిన పాపయ్య లను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమం లొసర్పంచ్ భారతి నాగు మేకల గురుకృష్ణ వెంకన్న గణేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జన్నారంలో వృద్ధురాలికి మాయమాటలు చెప్పి నగదు, బంగారం అపహరణ



మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో పింఛన్ రూ. 4వేల రూపాయలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఓ వృద్ధురాలి నుంచి రూ. 2 వేల పింఛన్ డబ్బులు, చెవులకున్న బంగారం అపహరించు కెల్లిన సంఘటన పొనకల్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు లింగంపల్లి సుశీల తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం పింఛన్ డబ్బులు తీసుకుని వారసంతలో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తానని అనుకున్న సమయంలో ప్రధాన రహదారిపై ఓ అపరిచిత వ్యక్తి సుశీలను పలకరించాడు. ఆమెతో మాటలు కలిపి పింఛన్ రూ. 4వేలు ఇప్పిస్తానంటూ రూ. 2వేలు తీసుకున్నాడు. అతనిపై అనుమానం రావడంతో తన చెవులకు ఉన్న పావుతులం కమ్మలను తీసి చేతులో పట్టుకుంది. ఆ కమ్మలను లాక్కొని ఫోన్ మాట్లాడుతూ పారిపోయాడు. ఈ విషయమే పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కొడుకు రాజలింగం తెలిపారు.

# మహిళా ఎస్ఐగా గీతా సేవలు.

## మహిళలకు భరోసాగా నిలుస్తున్న పోలీస్ అధికారి




సారంగాపూర్ మండల్ రిపోర్టర్, ఆగష్టు 26,జ్యోతి ప్రభంజనం **:మహిళా ఎస్ఐ ప్రత్యేక ఇంటర్వ్యూ**

ప్రశ్న: మహిళా ఎస్ఐగా పనిచేస్తున్న మీ అనుభవం ఎలా ఉంది?

ఎస్ఐ గీతా: మహిళా ఎస్ఐగా పనిచేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్నది. మహిళలు, యువతులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా వారికి నమ్మకం కల్పించడం నా ప్రధాన లక్ష్యం. విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను.

ప్రశ్న: మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి?

ఎస్ఐ గీతా: కుటుంబ సమస్యలు, వేధింపులు, సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ఇబ్బందులు వంటి సమస్యలపై మహిళలు పోలీసులను సంప్రదిస్తున్నారు. సమస్య ఏదైనా సరే భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న: మహిళలకు మీరు ఇచ్చే ప్రధాన సూచన ఏమిటి?

ఎస్ఐ గీతా: ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మౌనంగా ఉండకూడదు. వెంటనే కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.

ప్రశ్న: యువతులకు మీ సందేశం?

ఎస్ఐ గీతా: చదువుతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలి. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదు. తమ భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: పోలీస్ శాఖలో మహిళా అధికారుల పాత్ర ఎలా ఉంది?

ఎస్ఐ గీతా: మహిళా అధికారులు బాధిత మహిళలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను చెప్పుకునే వాతావరణం కల్పించడం మా బాధ్యత.

ప్రశ్న: చివరిగా మహిళలకు మీ సందేశం?

ఎస్ఐ గీతా: మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలి. అన్యాయం జరిగినప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు రావాలి. మీకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖను సంప్రదించండి. మహిళల భద్రతే మా బాధ్యత.. మీకు అండగా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ఉంటుందని ఎస్ఐ గీతా తెలిపారు.

# చేయూత పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

## అర్హులైన వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలి

## మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని మండల కార్యాలయంలో సమర్పించాలి



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం ఆగస్టు 26: తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛన్ పథకం కింద కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోందని సైదాబాద్ ఎమ్మార్వో ఏ. మణిపాల్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ప్రథమ దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు (తాటి, ఈత కల్లు కార్మికులు), చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, అలాగే థలసీమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో దివ్యాంగులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.అర్హత నిబంధనలు ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత ఉత్తర్వుల ప్రకారం ఉంటాయని ఎమ్మార్వో తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులు ముందుగా మీ-సేవ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకుని, అనంతరం సంబంధిత దరఖాస్తు పత్రాలను మండల కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 31-08-2026 వరకు ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

## – సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):కొత్తగూడెం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ అన్నారు. బుధవారం బూడిదిగడ్డ ఉన్నత పాఠశాలలో సిపిఎం ప్రతినిధులు సమస్యలపైసర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు బాత్రూమ్స్ టాయిలెట్స్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లే గ్రౌండ్ ఉన్నప్పటికీ వర్షాకాలంలో వరద నీరు నిలవడం వల్ల ఆడుకోలేని స్థితి ఏర్పడిందని అన్నారు. మూత్రశాలల వద్ద బయటికి పోతున్న నీరు వల్ల దుర్గంధంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం పాఠశాల అధ్యాపకులకు ప్రజలకు ఘర్షణలు అవుతున్నాయని ఈ సర్వేలో వాస్తవాలు బయట పడ్డాయి అన్నారు. పేద విద్యార్థులు కష్టపడి చదువుతున్న సమయంలో ఇటువంటి సమస్యల సుడిగుండంలో ఎలా చదువుకుంటున్నారని అర్థంకాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రజాప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ దృష్టికి మరి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన ఉండటం లేదని సర్వేలో వాస్తవాలు బయటికి వచ్చాయని రమేష్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసిన ఓట్లతో గెలిచిన పాలకవర్గాలు ప్రజాప్రతినిధులు విద్యార్థుల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకొని వారి ఆరోగ్యాలు చదువు నడవడిక కూడా అభివృద్ధి పదంలో నడిపించాల్సిన గురు తల బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని రమేష్ అన్నారు. మూత్రశాలలు బాత్రూమ్స్ వల్ల వస్తున్న దుర్గంధం బయట సరైనటువంటి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ దుర్గంధంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెంటనే నిధులు కేటాయించి సౌకర్యాలను మెరుగు పరచాలని సీపీఎం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఇదే పద్ధతిలో విద్యార్థుల పట్ల ప్రభుత్వ పాఠశాల పట్ల నిర్లక్ష్యం వాయిస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను విద్యార్థుల



తల్లిదండ్రులను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాడుగుల ప్రభాకర్, రాజ్ కుమార్, స్వచ్ఛ మిత్రా నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ మాసంలో....

# భక్తుల రద్దీకి పటిష్ట ఏర్పాట్లు

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు ?

**ఈఓ అనూష**



సారంగాపూర్ మండల్ రిపోర్టర్ ఆగష్టు 26,జ్యోతి ప్రభంజనం:జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల్ పెంబట్ల శ్రీ దుబ్బ రాజ రాజేశ్వర ఆలయంలో శ్రావణ మాసంలో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, క్యూ లైన్లు, తాగునీరు, పారిశుధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అనూష గారితో మాట్లాడడం జరిగింది ఈ సందర్భంగా వారితో భక్తులకి ఏర్పాటు చేసిన సౌకర్యాలు వారి మాటల్లో,

**ప్రశ్న: శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు?**

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశాం. దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా క్యూ లైన్లు, ప్రవేశం, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించాం.

**ప్రశ్న: భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**

ఈఓ: రద్దీఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. భక్తులు ఒకే చోట గుమిగూడకుండా క్యూ లైన్ల ద్వారా దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నాం. అవసరమైన చోట పోలీసు సిబ్బంది సహకారం కూడా తీసుకుంటున్నాం.

**ప్రశ్న: వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారా?**

ఈఓ: వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వారికి అవసరమైన సహాయం అందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

**ప్రశ్న: భక్తులకు తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయి?**

ఈఓ: తాగునీటి సౌకర్యంతో పాటు ఆలయ పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భక్తులు ఎక్కువసేపు వేచి ఉండే ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా సిబ్బందికి సూచనలు ఇచ్చాం.

**ప్రశ్న: భక్తుల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపట్టారు?**

ఈఓ: భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. రద్దీ ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాం. భక్తులు కూడా అధికారులకు సహకరించి క్రమశిక్షణతో దర్శనం చేసుకోవాలని కోరుతున్నాం.

**ప్రశ్న: భక్తులకు మీ సందేశం ఏమిటి?**

ఈఓ అనూష: శ్రావణ సోమవారం సందర్భంగా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులు తొందరపడకుండా, క్యూ లైన్లలో క్రమపద్ధతిలో ఉండి సిబ్బందికి సహకరించాలి. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని కోరుకుంటున్నాను.భక్తుల సౌకర్యమే లక్ష్యంగా..శ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనానికి దోహదపడనున్నాయి. అధికారులు, సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు కొనసాగిస్తున్నారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి మంత్రి సవితమ్మ పరామర్శ

## ప్రమాదంలో మృతి చెందిన రాహుల్‌కు నివాళులర్పించిన మంత్రి



జ్యోతి ప్రభంజనం ప్రతినిధి అనంతపురం,పెనుకొండ: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని కోగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గంగన్న కుమారుడు రాహుల్ ఇటీవల బైక్ ప్రమాదానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ గారు కోగిరి గ్రామంలోని రాహుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాహుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవితమ్మ తెలిపారు. రాహుల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.



## కుందుర్పిలో తీవ్ర విషాదం.

# ఒకే రోజు తండ్రీకొడుకుల మృతి

## మాజీ సర్పంచ్ బోయ పాతన్న, కుమారుడు పరశురామప్ప మృతి



కుందుర్పి,జ్యోతి ప్రభంజనం ప్రతినిధి :కుందుర్పి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామ మాజీ సర్పంచ్ బోయ పాతన్న, ఆయన కుమారుడు పరశురామప్ప అనారోగ్యంతో కొద్దిసేపటి వ్యవధిలోనే మృతి చెందారు.మంగళవారం సాయంత్రం పరశురామప్ప తుదిశ్వాస విడిచారు. కుమారుడి మరణ వార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయిన కొద్దిసేపటికే తండ్రి, మాజీ సర్పంచ్ బోయ పాతన్న కూడా కన్నుమూయడంతో గ్రామమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి.ఒకే రోజు తండ్రీకొడుకులు మృతి చెందడం స్థానికులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే శక్తిని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని పలువురు ప్రార్థిస్తూ కన్నీటి నివాళులు అర్పించారు.



# ఓ నేస్తం..!

## మిత్రుడవో ? తోబుట్టువో? బంధువో?



నీతో నాకున్న బంధం ఏమిటో తెలియదు?పేరుతో పిలవలేని అనుబంధం మనది,మాటలతో కొలవలేని మమకారం మనది.సంతోషంలో అందరూ తోడుంటారు,కష్టకాలంలో నిలిచేవాడే నిజమైన నేస్తం.లోకం నన్ను ఒంటరివాడిని చేసిన వేళ,నువ్వు మాత్రం నా నీడలా వెంట నడిచావు.అవసరం వచ్చినప్పుడు అడగకముందే అండగా నిలిచావు,బాధ్యత నాది అని చెప్పకుండానే నీదిగా మోశావు.నా కన్నీటిని నీ కళ్లలో దాచుకున్నావు,నా ఓటమిని నీ ఓటమిలా భావించావు.నేను పడిపోయిన ప్రతిసారీ చేయి అందించావు,నేను అలసిపోయిన ప్రతిసారీ ధైర్యం నింపావు.నా మాటల్లోని మౌనాన్ని కూడా చదివావు,నా నవ్వు వెనుక దాగిన బాధను గుర్తించావు.రక్త సంబంధం కాకపోయినా రుణబంధమై నిలిచావు,

పరిచయం చిన్నదైనా పరిచర్య మాత్రం జీవితమైంది.బంధం పేరుతో కాదు? మనసుతో కలిశావు,స్వార్థం లేకుండా నా పక్కన నిలిచావు.కాలం మారినా నీ మనసు మారలేదు,దూరాలు పెరిగినా నీ అభిమానం తగ్గలేదు.నాకు అవసరమైనప్పుడు కనిపించే మనిషివి కాదు,నాకు అవసరం లేనప్పటికీ తోడుండే మనిషివి.జీవితమంతా సంపాదించిన బంధాలకన్నా,ఒక్క నేస్తం ఇచ్చే నమ్మకమే గొప్పది.నువ్వు నాకు బంధువు అయ్యావా? మిత్రుడివయ్యావా? తెలియదు?కానీ నా జీవితంలో "మనిషివి" అన్న మాటకు అర్థమయ్యావు.

**రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.ఆంధ్ర ప్రదేశ్ చరవాణి : 9866179385**

# శ్రీరామ్ నగర్ కాలనీ ఫేజ్ -2 కు పొరుగు కాలనీల డ్రైనేజ్ కనెక్షన్ కలపొద్దు

**శ్రీరామ్ నగర్ కాలనీ ఫేస్ -2 లో ప్రస్తుత డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం**

**మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లుగా సమస్యను మరింత జటిలం చేయొద్దు**

**అధికారులకు శ్రీరాం నగర్ కాలనీ ఫేస్-2 కాలనీవాసుల విజ్ఞప్తి**



రంగా రెడ్డి జిల్లా,జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 26: మూలిగే నక్కపై తాటి పండు పడ్డచందంగా అసలే కాలనీలో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి ఇబ్బందులు పడుతుంటే పొరుగు కాలనీలా డ్రైనేజ్ పైప్ లైన్ ను అవుట్ లేట్ లేని తమ కాలనీలోని డ్రైనేజ్ పైప్ లైన్ కు కలిపితే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నాగోల్ సర్కిల్ పరిధిలోని పసుమాముల శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేజ్?2 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధికారుల కు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ నగర్ కాలనీ ఫేస్–2 సంక్షేమ సంఘం అధ్యక్షులు జె. శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనికి తోడు పొరుగు కాలనీల డ్రైనేజీ లైన్లను తమ కాలనీ డ్రైనేజీకి అనధికారికంగా అనుసంధానం చేస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ పైప్ లైన్ కనెక్షన్ తమ కాలనీలోని డ్రైనేజ్ కు అనుసంధానం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్ ను ఆయన కార్యాలయంలో కలుసుకొని వినతి పత్రం అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు.కాలనీకి ప్రస్తుతం ఉన్న ప్రధాన డ్రైనేజీ అవుట్‌లెట్, పైప్‌లైన్లు పూడికతో నిండిపోయి మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదని,తమ కాలనీ నుంచి వెలువడే మురుగునీటినే పూర్తిస్థాయిలో తరలించలేని పరిస్థితి ఉన్నప్పుడు, పొరుగు కాలనీల నుంచి అదనపు మురుగునీటిని ఇదే లైన్‌కు మళ్లించడం వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు.అక్రమంగా పనులు చేపడుతున్నారంటూ.. పొరుగు కాలనీలకు చెందిన వారు లేదా కాంట్రాక్టర్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ మురుగునీటి లైన్‌ను తమ కాలనీ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.ఎలాంటి నిబంధనలు పాటించకుండా బయటి ప్రాంతాల డ్రైనేజీని తమ కాలనీ లైన్‌కు కలిపితే వీధుల్లో మురుగునీరు నిలిచి తీవ్ర దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతోపాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**వెంటనే పనులు నిలిపివేయాలి**

తమ కాలనీ డ్రైనేజీకి ఇతర కాలనీల నుంచి ఎలాంటి అనధికారిక కనెక్షన్ ఇవ్వకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రస్తుతం జరుగుతున్న అనుమానాస్పద డ్రైనేజీ పనులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వెంటనే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రధాన డ్రైనేజీ అవుట్‌లెట్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూడికను తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ తనిఖీ బృందాన్ని పంపించి పరిస్థితిని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

**అధికారుల స్పందన కోసం కాలనీవాసుల ఎదురుచూపులు**

డ్రైనేజీ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేజ్?2 వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.అసోసియేషన్ అధ్యక్షుడు జె. శ్రీధర్, ఉపాధ్యక్షుడు కె. బాలరాజు, ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్‌రెడ్డి, జాయింట్ కార్యదర్శి ఎస్. శంకర్, కోశాధికారి బి. నాగరాజుతో పాటు ఈసీ సభ్యులు పి. రాజీవ్‌రెడ్డి, పూర్ణచందర్‌గౌడ్, కోటేశ్వర్‌రావు, బి. అశోక్ తదితరులు ఈ వినతిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రయాణం సాగేదెలా..?

**ఆర్కేల నుంచి నార్సింగి రోడ్డుతో ప్రజల అవస్థలు.. దారిపొడవునా గుంతలే..**



మెదక్,జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 26 :మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం, పెద్దశంకరంపేట్ (ఎ) ఎల్లుపేట,ఎల్పుగొండ, అర్కేల,డాక్య తండా, గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దారిపొడవునా ఏర్పడిన గుంతలు,రోడ్డుపై కనిపిస్తున్న గుంతలతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్న పరిస్థితి నెలకొంది.ఏళ్లుగా ఈ రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ ప్రయాణించాల్సి రావడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు,ఇతర వాహనాలు కూడా ఇబ్బం దులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రభుత్వాలు మారుతున్నా,ప్రజల అవస్థలు తీరడం లేదు.నార్సింగి రహదారిసమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించి,వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యమైన రహదారి నిర్మాణం చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రేమ, శాంతి, సోదరభావానానికి ప్రతిక

**జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, పట్వారీ శశిధర్**



కూకట్ పల్లి, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు 26 :శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఖాజా నగర్‌లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ తో కలిసి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ బోధనలు ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం, సేవా స్ఫూర్తికి ప్రతీకలని అన్నారు. ఆయన చూపిన మార్గం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలోపేతమవుతాయని తెలిపారు.మత సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, మానవత్వం, పరస్పర గౌరవంతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మత పెద్దలు గౌస్ భాయ్, ఇస్మాయిల్, ఖైసర్, నవాజ్, షౌకత్ అలీ మున్నా, రెహ్మాన్, మున్నా, అలాగే శ్రీను నాగభూషన్, నారాయణ, రవీందర్, లక్ష్మణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, టీం పట్వారీ సభ్యులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# హస్తినాపురంలో బి ఎస్ ఆర్ ఇన్ఫ్రా నూతన వెంచర్

**- భూమి పూజ, బ్రోచర్ ఆవిష్కరణహస్తినాపురంలో హస్తిన స్క్వేర్**

**- బి ఎస్ ఆర్ రెసిడెన్సీ భూమి పూజ ఘనంగా**

**రూ. 5500 లాంచింగ్ ఆఫర్ తో హస్తిన స్క్వేర్ ఫ్లాట్స్**

**హస్తినాపురంలో హస్తిన స్క్వేర్ భూమి పూజ, బ్రోచర్ లాంచింగ్**




రంగారెడ్డి జిల్లా ,జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 26 : ప్రముఖ నిర్మాణ సంస్థ బి ఎస్ ఆర్ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో హస్తినాపురం పంతలూన్స్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించనున్న హస్తిన స్క్వేర్ – బిఎస్ఆర్ రెసిడెన్సీ అపార్ట్మెంట్ ప్రాజెక్ట్ భూమి పూజ, బ్రోచర్ లాంచింగ్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఓబుల్ రెడ్డి మాట్లాడుతూఉదయం 10 గంటలకు భూమి పూజ, 11 గంటలకు బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 12:30 గంటలకు లంచ్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నాణ్యతతో కూడిన నిర్మాణం, భవిష్యత్ తరాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సదుపాయాలతో ఈ ప్రాజెక్ట్ ను నిర్మిస్తున్నామన్నారు. లాంచింగ్ ఆఫర్ కింద రూ. 5500/– స్క్వేర్ ఫీట్కే అందిస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్ట్ హస్తినాపురం ప్రాంతంలో అన్ని సౌకర్యాలకు దగ్గరగా ఉండటంతో పాటు, మంచి పెట్టుబడిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి నిర్మాణ రంగ ప్రముఖులు, కస్టమర్లు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జాజుల శ్రీనివాస్ గౌడ్ దంపతులు

**వివాహ వేడుకకు హాజరైన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు**



మునుగోడు,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 26: సర్వేల్ శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో కోతులారం గ్రామానికి చెందిన బంగారు మదారు? సుమతమ్మ దంపతుల ప్రథమ పుత్రుడు గోపాలకృష్ణ? ప్రవళికల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, అనిత దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కోతులారం గ్రామ మాజీ సర్పంచ్ జాజుల పారిజాత సత్యనారాయణ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు కందుల ప్రభాకర్ గౌడ్, వార్డు మెంబర్ కొండూరు నర్సింహ్మా గౌడ్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ వట్టికోటి వెంకటేష్, జాజుల భాస్కర్, కర్నాటి లింగస్వామి, బంగారు వెంకటేష్తో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# జడ్చర్లలో మిలాద్-ఉన్-నబి ర్యాలీలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల, ఆగస్టు 26,జడ్చర్ల మున్సిపాలిటీలో ముస్లిం సోదరులు నిర్వహించిన పవిత్ర మిలాద్-ఉన్-నబి ర్యాలీలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే గారు, మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, ప్రేమ, సహనం, మానవత్వం వంటి విలువలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, ఐక్యతతో ముందుకు సాగుతూ జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501**, PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**